# ఇల్లుగల వాళ్లంతా ఇంతే!

మారుతి

"అద్దె కొంపల్లో ఎన్నాళ్ళని అగచాట్లు పడతామండీ! సొంత ఇల్లంటూ ఒకటి ఉంటే ఈ బాధలు తప్పుతాయి గదా!" అన్నది భారతి.

"నిజమే! కాని కాలం కలిసి రావాలి గదా! ఆ టైము వస్తే ఎవరూ ఆపలేరు" అన్నాడు శివం వేదాంత ధోరణిలో.

అద్దెకింద నెలకు రెండు వందల యాభై దాకా ఇస్తున్నాడు గత పదిహేనేళ్ళుగా. అర డజనుకు పైగా ఇళ్ళు మారాడు ఈ పదిహేనేళ్ళలో. సంవత్సరానికి మూడువేలు! అంటే ఈ పదిహేనేళ్ళనుంచీ దాదాపుగా నలభై అయిదు వేలు అద్దెల కిందనే ఖర్చయింది!

'నలభై అయిదు వేలు పెడితే నిక్షేపం లాంటి ఇల్లు కట్టుకు నుండవచ్చు' అంటుంది భారతి.

"ఆడవాళ్ళ ఆలోచనలన్నీ ఇలాగే ఉంటాయిలే!... అంత డబ్బు ఒక్కసారి మన చేతులలో ఉండొద్దా!" ఇన్‌స్టాల్‌మెంటులో ఇల్లు కడతానంటే కుదిరే పని కాదని ఆమెకు అర్థమయ్యేటట్టు నచ్చచెప్పాడు.

"సొంత ఇల్లు కట్టుకోవడానికి అప్పులు ఇస్తార్ట గదండీ! పోనీ అదయినా పెట్టండి" అని సలహా ఇచ్చింది భారతి.

"అప్లికేషను పెట్టి అయిదేళ్ళయింది. నా కంటే ముందు పెట్టిన వాళ్ళు ముప్పయిరెండు మందికి వస్తేగాని నాదాకా రాదు. అప్పటికి రిటైర్ పించను తీసుకుంటూ ఉంటాను." చెప్పాడు శివం.

"పోనీ ఎక్కడయినా ముందు స్థలం తీసుకుందాం. ఆ తరవాత నిదానంగా ఇల్లు కట్టుకో వచ్చు." భారతి మరో సలహా ఇచ్చింది.

"ఆ పని ఎప్పుడో చేసి ఉండాల్సింది. ఇప్పుడు ఖాళీ స్థలాల ధరలు పాపం పెరిగిపోయినట్టు పెరిగి పోయివాయి. సిటీకి చివర నున్న చోట కూడా గజం నూట యాభై రూపాయ లమ్ముతున్నారు. మన దగ్గరున్న డబ్బుతో ముప్పయి గజాలు కూడా రావు." నిరాశగా అన్నాడు శివం.

"అయితే అద్దెఇళ్ళ అగచాట్లు జీవితాంతం తప్ప వన్న మాట!" అని నిట్టూర్చింది భారతి.

సొంత ఇల్లు ఏర్పరచుకోవాలన్న కోరిక నానాటికి బలపడుతున్నదే గాని తగ్గటం లేదు.

ఆ మధ్య వాళ్ళ ఆఫీసులో పనిచేసే తోటి ఉద్యోగి ఇల్లు కట్టుకొని గృహప్రవేశం అయినాడు. ఆ నాడు సొంత ఇంట్లోకి వెళ్తున్న ఆ దంపతుల మొహంలో గర్వంతో కూడిన ఆనందం చూసిన శివం తనకు 'అటువంటి ఘడియ ఎప్పుడు వస్తుందో' అని నిట్టూర్చాడు. హితులు, బంధువులు రకరకాల బహు మతులు చదివించారు. ఆ రోజంతా వాళ్ళ కొత్త ఇల్లు కోలాహలంగా ఉంది. సందడంతా తగ్గిన తర్వాత శివం నెమ్మదిగా అడిగాడు ఆ ఇల్లు కట్టుకున్నాయన్ని.

"అదృష్టవంతులండీ! సొంత ఇల్లు కట్టు కున్నారు ... ఎట్లా సాధించారు, గురూగారూ!"

"అబ్బో! ఇల్లు కట్టడం మాటలు కాదు, మహా ప్రభో! కట్టడం మొదలుపెట్టిన దగ్గర్నించి పూర్తి అయ్యే వరకు అడుగడుగునా అవరోధాలే కదండీ! పని వాళ్ళు మన ప్రాణాలు తోడేస్తారు. ఆ బాధలు అనుభవించాలేకాని ఏమని వర్ణించమంటారు, శివం గారూ! సమయానికి సిమెంటు దొరకదు ... పనివాళ్ళు సరిగా చెప్పిన మాట వినరు ... వడ్రంగి దర్వాజాలు, తలుపులు, కిటికీలు అనుకున్న సమయానికి తయారు చెయ్యడు. మనకేమో సమయానికి పని కావటల్లే దన్న ఆందోళన ... అబ్బబ్బబ్బ! ఆ టెన్షన్ భరించలేమండీ ... పగవాడికి కూడా వద్దు ఆ బాధ" అని కొంచెం గుక్క తిప్పుకోటం కోసం ఆగాడు కొత్తగా ఇల్లుకట్టుకున్న ఆయన.

అప్పుడే అక్కడకు వచ్చిన ఆయన భార్య అందు కుంది—"ఆయన చెప్పేది నిజమే, అన్నయ్యగారూ! అందులో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు... అరవై వేలు చేతిలో ఉంచుకొని దిగితే చివరకు ఒంటి మీదున్న బంగారం కూడా బాంకులో పెట్టి అప్పు తీసుకోవాల్సి వచ్చిం దనుకోండి! అంత పెట్టినా ఇంకా చేయించాల్సిన పనులు మిగిలి పోయివాయి ..."

ఆ ధోరణి అట్లాగే కొనసాగేదే కాని అదృష్ట వశాత్తు ఇంతలో ఎవరో వచ్చి పిలిచా రామెను. శివం కూడా అక్కడి నుంచి నీరసంగా లేచి మిత్రుడి దగ్గిర సెలవు తీసుకుని బయటకు నడిచాడు.

ఇల్లు కట్టడంలో ఇన్ని కష్టాలుంటే, ఇంతమంది ఎట్లా కట్టుకోగలుగుతున్నారో అర్థం కాలేదు శివానికి. సొంత ఇల్లు ఏర్పరచుకున్న వాళ్ళందరూ ఇట్లాగే మాట్లాడతారేమో గొప్పకోసం!

గృహప్రవేశానికి వెళ్ళి వచ్చిన భారతి భర్తతో అన్నది—"వాళ్ళ ఇల్లు చాలా బాగుంది కదండీ! చిన్న దయినా అందంగా కట్టుకున్నారు. మంచి కళ ఉన్న దండీ ఆ ఇంట్లో! మనం కూడా ..."

"ఆ! ఆ! ... ఇక ఆపు. మన కంత అదృష్టం కూడానా! ఇంటిమీదనే అరవై, డెబ్బై వేలు పెట్టాలట! అంత డబ్బు ఒక్కసారిగా ఎక్కడ నుంచి తేగలం?!" శివం కొట్టిపారేశాడు.

"ఆ కట్టినాయన కూడా మీకంటే గొప్ప ఉద్యోగస్థుడేం కాదుగా! ఆయన కట్టగా లేంది మన మెందుకు కట్టలేం! ... మీ అమ్మగారిని ఒప్పించి ఎకరం పొలం అమ్మించండి. పదిహేను వేలొస్తుంది. ప్రావిడెంటు ఫండు లోను పెట్టండి.... వీటితో ముందర ప్రారంభిస్తే తర్వాత తిప్పలు తర్వాత." ఆలోచనలకు వూపిరి పోసింది భారతి.

శివం మౌనంగా విని వూరుకున్నాడు. పొలం అమ్మి ఇల్లు కట్టడానికి తల్లి ఒప్పుకోదు. ప్రావి డెంటు ఫండు లోను పెట్టినా అంత మొత్తం రాదు!

ఇటువంటి వ్యర్థమయిన ఆలోచనల తోనే కొంత కాలం గడిచింది. కాలం గడిచిన కొద్దీ సొంత ఇంటి కోసం బెంగకూడా ఎక్కువయింది. ఇళ్ళు కట్టుకుని సొంత ఇళ్ళలో కులుకుతున్న వాళ్ళను చూసినా, వాళ్ళ గురించి ఎవరయినా చెప్పగా విన్నా కోపం తోను, ఈర్ష్యతోను శరీరం దహించుకు పోతున్నది.

అప్పుడే ఆపద్బాంధవుడిలా, కోరిన కోరిక తీడేర్చే కల్పవృక్షంలా ఒక ప్రకటన వెలువడింది. "సరస్థల పురంలో ప్రభుత్వమే ఇళ్ళు కట్టించి ఇస్తుందనీ, ఇష్టమున్న వాళ్ళు తమ పేర్లు నమోదు చేసుకో వచ్చుననీ, వివరాలు ఒక నెల రోజులలో ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో చర్చించి నిర్ణయిస్తారనీ."

భారతి ప్రోద్బలంతో శివంవెంటనే సరస్థలపురం ఎక్కడున్నదో, అక్కడికి ఎట్లా చేరుకోవాలో సమాచారం సేకరించాడు. అది సిటీకి రమారమి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇప్పు డిప్పుడే స్థలాలు కొనుక్కుని కొంతమంది ఇళ్ళ కట్టుకుంటున్నారు. ప్రయివేటు స్థలాలకు దూరం గానూ, ప్రధాన రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలోనూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళు కట్టించే పథకం నిశ్చయమయింది. ఒక ఆదివారం ప్రత్యేకంగా రిక్షాలోను, సిటీ బస్సులోను, కొంత దూరం కాలి నడకను ప్రయాణం చేసి అతి కష్టంమీద వెళ్ళి ఖాళీ స్థలాలను చూసి గుండె బేజారయి తిరిగి వచ్చాడు.

భారతి మాత్రం ధైర్యం చెప్పింది. "ఇళ్ళు తయారై మనుషులు తిరుగుతుంటే అదే మహా పట్నమయిపోతుంది. వచ్చినట్లు బస్సుకూడా వేస్తారు అక్కడి దాకా! మీరు మాత్రం ఈ అవకాశం పోనీయద్దు. ముందర ఎంత కట్టాలో కనుక్కుని ఆ సొమ్ము కట్టేయండి" అని ఆదేశం కూడా ఇచ్చింది.

సరస్థలపురంస్కీమును గురించి వాకబు చెయ్యగా చెయ్యగా, ఇంకో రెండు నెలల్లో ప్రణాళిక సిద్ధమై అచ్చు వేసిన కరపత్రాలు, అప్లికేషను ఫారాలు పంచి పెట్టారు. తక్కువ ఆదాయం గలవారికి ఒక నమూనా మధ్యతరగతి ఆదాయం గల వారికి ఒక నమూనా, ఇళ్ళ ప్లానులు, వాటికి కేటాయించిన స్థలం, చెల్లించ వలసిన ధరావతు మొదలైన వివరాలన్నీ అందులో పొందుపరిచారు.

ఆ కరపత్రాలను ఇంటి కెళ్ళిన తరవాత అతి ఉత్సాహంగా భార్యకు చూపించాడు. రెండు రకాల ఇళ్ళ ప్లానులు కూలంకషంగా పరిశీలించారు. ఏదైతే తమకు అనుకూలంగా ఉంటుందో లెక్క వేసి చివరకు ఎమ్. ఐ. జి. అనబడే మధ్యతరహా ఆదాయపు ఇల్లయితే కాని తమ అవసరాలకు చాలదని నిశ్చయానికి వచ్చారు. ఆలస్యం చేయకుండా అప్లికేషను ఫారాలు పూర్తి చేసి, డిపాజిట్ సొమ్మును డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకుని సొసైటీ సెక్రటరీగారికి స్వయంగా ఇచ్చి రశీదు తీసుకు వచ్చాడు శివం.

మనం ఎటూ స్వయంగా ఇల్లు కట్టుకునే స్తోమత, శక్తి లేనేలేదు. ఎవరో కట్టించి ఇస్తుంటే అంతకంటే కావాల్సిందేముంది.? కష్టపడకుండా గృహప్రవేశం అయిపోవడమే! ఆ శుభ ముహూర్తం కోసం ఎదురు చూస్తూ కూచున్నాడు శివం.

ఎదురు చూడగా చూడగా కొన్ని నెలల తరవాత సొసైటీ నుంచి ఒక నోటీసు వచ్చింది. మొదటి వాయిదా కింద ఎమ్. ఐ. జి. ఇంటికి ఎనిమిది వేల రూపాయలు పదిహేను రోజుల లోగా కట్టాలని.

గడువు లోపలే సొమ్ము చెల్లించాడు శివం. తనతోపాటు కొన్ని వేల మంది సరస్థలపురంలో

తయారవబోయే ఇళ్ళ కోసం ముందుకువచ్చి, సొమ్ము చెల్లించారని తెలుసుకున్న శివం ఆనందంతో తల్లడిల్లి పోయాడు! ఇక భారతి సంగతి చెప్పనక్కర్లేదు. అడిగిన వాళ్ళకు, అడగని వాళ్ళకు కట్టబోయే కొత్త కాలనీ ఇళ్ళ వివరాలు సవిస్తరంగా చెప్పడమే పనిగా పెట్టుకున్నది. కొత్త ఇంట్లోకి వెళ్ళిన తరవాత ఏయే రకాల మొక్కలు 'ఇంటి చుట్టూతా పెంచాలి అనే అంశం మీద రోజూ కాసేపయినా పడుకోబోయే ముందు మాట్లాడుకుంటే కాని నిద్ర పట్టని స్థితికి వచ్చారిద్దరూ.

కొబ్బరి, మామిడి మొదలయిన మొక్కలు ఇప్పటి నుంచే తెచ్చి ఉంచుకుంటే సొంత కొంపలో కెళ్ళగానే తీసుకెళ్ళి అక్కడ పాతుకోవచ్చునన్న అద్భుతమైన ఆలోచన వచ్చిన భారతి భర్తను పోరి, అది వర్షాకాలం కావటం చేత రెడ్‌హిల్స్‌లో నర్సరీకి పంపించి కోనసీమ కొబ్బరి మొక్కలు రెండు, మామిడి, దానిమ్మ చెరొకటి తెప్పించింది. తీరా వాటిని తమ వాటాకు పక్కగా ఉన్న కాస్త జాగాలోనా పాతే ప్రయత్నంలో ఉండగా ఇల్లుగలావిడ తీవ్రమైన అభ్యంతరం చెప్పింది.

భారతి సౌమ్యంగా నచ్చ చెప్పటానికి ప్రయత్నించింది కాని చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లయింది.

“వెళ్ళేటప్పుడు తీసుకెళతా మండీ అప్పటిదాకా ఉండనివ్వండి” అని బతిమ లాడింది భారతి.

“వెళతాం, వెళతాం అని సంవత్సరం నుంచీ అంటున్నారు. ఇంతవరకు ఆలూ లేదు చూలూ లేదు అక్కడ చూస్తే.” ఇల్లుగలావిడ ఈసడించింది.

“నలుగురితో పని గదండీ, మన మనుకున్నట్లు పనులవదూ మరి. పునాదులు తీశారు. బేస్‌మెంటు అయిపోతే గోడలు లేవడమే” అని శివం సర్ది చెప్పబోయాడు.

“ఇప్పటికి సంవత్సరం నుంచీ వింటున్నాను. ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలో పైన కప్పు పడి, తలుపులూ ద్వారబంధాలూ తయారై మీకు అప్పగించేటందుకు. అద్దె పెంచమంటే పెంచరు. అదేమంటే సొంత ఇంట్లోకి వెళదాం అంటారు” అని ఎత్తి పొడిచిందామె భారతి చేతిలో పట్టుకున్న మొక్కల వంక అసహ్యంగా చూస్తూ.

“ఛీ, ఛీ! ఇళ్ళుగల వాళ్ళంతా ఇంతే! బిళ్ళ కుడుముల్లాగా ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నా ఉత్తి పుణ్యానికి ఉండనిస్తున్నట్టు మాట్లాడతారు.” భారతి చేతిలో మొక్కలు విసిరికొట్టి లోపలికి వెళ్ళిపోయింది రుసరుసలాడుతూ.

శివం తను ఒక్కడే ఇల్లుగలావిడ ముందు నిలబడితే, ఆవిడకు అద్దె పెంచలేదన్న సంగతి మళ్ళీ గుర్తుకొస్తుందని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా భారతి విసిరి పారేసిన మొక్కలు ఏరుకొని ఇంట్లోకి వెళ్ళి తలుపేసుకున్నాడు.

అదేమీ పట్టించుకోకుండా “వచ్చే నెలనుంచి ఇరవై రూపాయలు పెంచాల్సిందే. అందుకు ఇష్టమయితేనే ఉండండి. లేకపోతే ఖాళీ చెయ్యండి” అని వార్నింగిచ్చి సణుక్కుంటూ నిష్క్రమించింది ఇల్లుగలావిడ. వినోదం చూస్తున్న వీధిలో వాళ్ళు అది అంత తొందరగా ముగిసినందుకు విచారిస్తూ వెళ్ళిపోయారు.

లోపలికి వెళ్ళిన శివానికి ఒక అనుమానం వచ్చింది—'ఇల్లుగలవాళ్ళంతా ఇంతే అన్నది భారతి. రేపు తామూ ఇంతేనా? సొంత ఇల్లు రాగానే అద్దె ఇళ్ళలో పడిన అగచాట్లు మరిచిపోతారా?'. అన్నది పదివేల మిలియను డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. భారతి రుసరుసలు చూసిన తర్వాత తన అనుమానాన్ని బయటకు అనలేక పోయాడు. ఇల్లుగలావిడ కోపమంతా తనమీద చూపించే ప్రమాదం కూడా లేకపోలేదు.

“ఏదీ—ఆ ఇంటి ప్లాను ఎక్కడ పెట్టారు? ఒక మాటు బయటికి తీయండి” అన్నది భారతి ఉరమని పిడుగులాగా.

శివం ముందు అర్థం గాక తరవాత ఎమ్. ఐ. జి. ఇంటి ప్లాను ఉన్న అచ్చు కాగితాలు తీసి ఆమె కందించాడు. ప్లాను ఒకసారి చూసింది భారతి.

“మన ముంటూ ఒక భాగం అద్దెకిచ్చే వాటానికి వీలుంటుందా!” అని తనలో తాను అనుకున్నట్టుగా పైకి అనేసింది.

శివం అర్థం చేసుకున్నాడు. తను ఇంటి యజ



